ఆరోగ్యానికి జిమ్‌దాబాద్



త్రిష్ణా మైదానంలో ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్

- ఉక్కునగరంలో ఓపెన్ జిమ్‌ల ఏర్పాటు
- రూ.40 లక్షలతో జిమ్ పరికరాలు
- ఫిట్‌నెస్ సాధనపై స్థానికుల దృష్టి



ఉక్కు స్టేడియంలోని ఓపెన్ జిమ్‌లో వ్యాయామం చేస్తున్న స్థానికులు

ఉక్కునగరం: ఆరోగ్యకరమైన సమాజం ఏర్పడినప్పుడే అభివృద్ధి సాధ్యమవుతుందని నమ్మిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజల ఆరోగ్యం మెరుగుపడేందుకు అవసరమైన సౌకర్యాలు కల్పించారు. ఇందులో భాగంగా పార్కులను అభివృద్ధి చేయడంతోపాటు ఓపెన్ జిమ్‌లు ఏర్పాటు చేశారు. ప్రజల ఆరోగ్య పరిరక్షణకు ఇవి ఎంతగానో దోహదపడుతున్నాయి.

జీవీఎంసీ ఆధ్వర్యంలో స్టీల్‌ప్లాంట్ టౌన్‌షిప్‌లో మొత్తం 8 ఓపెన్ జిమ్‌లు ఏర్పాటు చేశారు. స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం వివిధ సెక్టార్లలో పార్కులు ఏర్పాటు చేసింది. మొత్తం టౌన్‌షిప్‌లో ఒక్క సెక్టార్–5లో మాత్రమే చిన్న జిమ్ ఏర్పాటు చేశారు. అది ఉక్కు నగరం వాసులకు సరిపోకపోవడంతో యువకులు చుట్టుపక్కల ప్రాంతాల జిమ్‌లపై ఆధారపడాల్సి వచ్చేంది. నేడు ఆ బాధలు తప్పాయి.

ప్రజల ఆరోగ్య పరిరక్షణ దృష్ట్యా జీవీఎంసీ ఆధ్వర్యంలో నగరంలోని అన్ని ప్రాంతాల్లో ఓపెన్ జిమ్‌లు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. సుమారు రూ.40 లక్షల జీవీఎంసీ నిధులతో ఉక్కు నగరంలో ఎనిమిది చోట్ల ఈ జిమ్‌లను అందుబాటులోకి తీసుకొచ్చారు. ఉక్కు స్టేడియం, త్రిష్ణా మైదానం, అంబేడ్కర్ పార్కు, మహాత్మా గాంధీ పార్కు, గుర్రం జాషువా పార్కు, సెక్టార్-11 పార్కు, సీఐఎస్‌ఎఫ్ కాలనీ, అగనంపూడి రహదారిలోని వాకింగ్ పార్కులో ఓపెన్ జిమ్‌లు ఏర్పాటు చేశారు. ఫిజికల్ ఫిట్‌నెస్‌పై దృష్టి సారించిన స్థానిక ప్రాంతాలవాసులు ప్రతి రోజూ జిమ్‌లకు వచ్చి వ్యాయామం చేస్తూ ఆరోగ్యాన్ని కాపాడుకుంటున్నారు. మహిళలు, యువత, పిల్లలు ఉత్సాహంగా సాధన చేస్తున్నారు. ఓపెన్ జిమ్‌లు ఏర్పాటు చేయడంపై ఉక్కునగరం వాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఓపెన్ జిమ్‌లు ఉపయోగకరం



జీవీఎంసీ ఆధ్వర్యంలో ఉక్కునగరంలోని వివిధ ప్రాంతాల్లో ఓపెన్ జిమ్‌లు ఏర్పాటు చేయడం చాలా ఉపయోగకరంగా ఉన్నాయి. ఖాళీ సమయంలో అక్కడికి వెళ్లి వ్యాయామం చేసుకుంటున్నాం. మహిళలు, పిల్లలు కూడా జిమ్ చేయడం ఆనందదాయకం.

–పి.వరప్రసాదరావు, స్టీల్‌ప్లాంట్ ఉద్యోగి

జిమ్‌ల కొరత తీరింది



ఉక్కునగరంలో స్పోర్ట్స్ విభాగం ఆధ్వర్యంలో ఒక్క చోట మాత్రమే జిమ్ ఉంది. అందులో కూడా వ్యాయామానికి అవసరమైన అన్ని రకాల వస్తువులు ఉండేవి కావు. ఇప్పుడు ఓపెన్ జిమ్‌లు చాలా చోట్ల ఏర్పాటు చేయడం వల్ల అందరికీ అవకాశంగా ఉంది.

–బి.చిరంజీవి తేజ, స్టీల్‌ప్లాంట్ టౌన్‌షిప్

పార్టీ బలోపేతానికి అందరి కృషి



మాట్లాడుతున్న ఉరుకూటి చందు

కూర్మన్నపాలెం: పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని వైఎస్సార్‌సీపీ గాజువాక సమన్వయకర్త ఉరుకూటి రామచంద్రరావు(చందు) పిలుపునిచ్చారు. పార్టీ 87వ వార్డు కార్యకర్తలతో వార్డు ఇన్‌చార్జి కోమటి శ్రీనివాసరావు ఆదివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చందు మాట్లాడుతూ పేదల జీవితాల్లో వెలుగులు నింపిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ గెలిపించుకునేలా కార్యకర్తలు నిబద్ధతతో పనిచేయాలని కోరారు. కార్యక్రమంలో మాడుగుల ఎన్నికల పరిశీలకులు ఉరుకూటి అప్పారావు, కాంద్రేగుల అప్పలనాయుడు, బొడ్డేటి మోదీనాయుడు, కోమటి రమాదేవి, ప్రగడ గోవిందరాజులు, కోనేటి పారిపల్లి, అధిక సంఖ్యలో వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

క్లుప్తంగా

తోకాడలో ఉచిత వైద్య శిబిరం



మహిళకు రక్త పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

అక్కిరెడ్డిపాలెం: ఆటోనగర్ సమీపంలోని తోకాడలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఆదివారం గ్రామంలోని సమైక్య అపార్ట్‌మెంట్ ఫ్లాట్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గాజువాక క్లియర్ యు డయాగ్నోస్టిక్ సౌజన్యంతో స్థానికులకు వివిధ వైద్య పరీక్షలు చేశారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో సమైక్య అపార్ట్‌మెంట్ అధ్యక్షుడు ఎం.వెంకటేశ్వరరావు, ఉపాధ్యక్షుడు బి.తౌడన్న, సంయుక్త కార్యదర్శులు కె.చెన్నం నాయుడు, శ్రీనివాస్ చౌదరి, దొర, తదితరులు పాల్గొన్నారు.

న్యాయవాది లక్ష్మికి ఘన సత్కారం



లక్ష్మిని సత్కరిస్తున్న అసోసియేషన్ అధ్యక్షుడు రాంబాబు తదితరులు

పెదగంట్యాడ: అండిబోయిన లక్ష్మి న్యాయవాది వృత్తిలో ఉంటూ జాతీయ స్థాయి యోగా పోటీల్లో బంగారు పతకం సాధించడం అభినందనీయమని విశాఖపట్నం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు చింతపల్లి రాంబాబు అన్నారు. యాత కార్పొరేషన్ డైరెక్టర్, జాతీయ స్థాయి యోగా పోటీల్లో బంగారు పతకం సాధించిన లక్ష్మిని ఆదివారం ఆయన ఘనంగా సత్కరించారు. జీవీఎంసీ 72వ వార్డు వినాయకనగర్ వుడా కాలనీలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. భవిష్యత్తులో లక్ష్మి మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సంపంగి బన్నీ, గుడిపూడి సుబ్బారావు, అండిబోయిన అప్పారావు, భుజంగరావు, వనుము నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణ పనులకు భూమి పూజ

అక్కిరెడ్డిపాలెం: జీవీఎంసీ 69వ వార్డు తుంగ్లాంలో రోడ్డు నిర్మాణ పనులకు కార్పొరేటర్ కాకి గోవిందరెడ్డి ఆదివారం భూమి పూజ చేశారు. రూ.20 లక్షల వ్యయంతో గ్రామం బరేల్ గ్రౌండ్ వరకు రోడ్డు విస్తరణ పనులు చేపట్టనున్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ నాయకులు మద్ది కుంచారావు, బి.నందీశ్వరరావు, నీలాపు వరహాలురెడ్డి, పాముల సత్యనారాయణ, ఎన్.సింహాచలం, సలాది అచ్చిబాబు, తదితరులు పాల్గొన్నారు.

ఉక్కు ఉద్యమానికి భెల్ సీఐటీయూ సంఘీభావం



నిరాహార దీక్షలో నినాదాలు చేస్తున్న భెల్ సీఐటీయూ నాయకులు

అక్కిరెడ్డిపాలెం: స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద చేపట్టిన నిరాహార దీక్షలు 997వ రోజుకు చేరాయి. ఆదివారం ఉద్యమానికి భెల్ (హెచ్‌పీవీపీ) సీఐటీయూ నాయకులు తమ సంఘీభావం తెలిపారు. దీక్షలో సీటు ప్రధాన కార్యదర్శి జి.టి.పి.ప్రకాష్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీటు నాయకులు ఎస్.జగన్నాథరావు, కె.నారపురెడ్డి, జి.అప్పలనాయుడు, ఎస్.అప్పారావు, సీహెచ్.ఎస్.వి.నారాయణ, తదితరులు పాల్గొన్నారు.



వైఎస్సార్‌సీపీ గెలుపే లక్ష్యం



మాట్లాడుతున్న గుడివాడ లతీష్

అక్కిరెడ్డిపాలెం: వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు సమష్టిగా పార్టీ గెలుపుకోసం కృషి చేసి తిరిగి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిగా చేసుకోవాలని 68వ వార్డు ఇన్‌చార్జి గుడివాడ లతీష్ అన్నారు. ఆదివారం వార్డు పరిధి మిందిలోని గుడివాడ అప్పన్న కల్యాణ మండపంలో వైఎస్సార్ సీపీ గాజువాక సమన్వయకర్త ఉరుకూటి రామచంద్రరావు(చందు)తో కలిసి ఆయన విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చందు మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్ రాష్ట్రంలో సంక్షేమ పరిపాలన అందిస్తున్నారన్నారు. ప్రతి ఒక్కరూ పార్టీ గెలుపునకు శక్తి వంచన లేకుండా పని చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పార్టీ వార్డు అధ్యక్షుడు వరదాడ వెంకటరమణ, నగర కార్పొరేషన్ డైరెక్టర్ గుర్రం రాజేష్, ఈటి శ్యామలరావు, పోలవరపు శ్రీహరి, రెడ్డిపల్లి చిట్టిబాబు, తదితరులు పాల్గొన్నారు.

వినియోగదారుల అవగాహన ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న ఆశ్రా ప్రతినిధులు

గాజువాక: జాతీయ వినియోగదారుల దినోత్సవం సందర్భంగా అడ్వకేట్స్ అసోసియేషన్ ఫర్ సోషల్ రెస్పాన్సిబిలిటీ అండ్ అవేర్‌నెస్(ఆశ్రా) ఆధ్వర్యంలో ఆదివారం వినియోగదారుల అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఆశ్రా విశాఖ జిల్లా ఇన్‌చార్జి తోట శత్రుఘ్నుడు ఆధ్వర్యంలో చేపట్టిన ఈ ర్యాలీ అనంతరం పాతగాజువాకలో మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా పౌర సరఫరాల శాఖ అధికారి టి.కృష్ణ మాట్లాడుతూ నాణ్యతతో కూడిన సేవలను పొందడం ప్రతి వినియోగదారుడి హక్కు అని పేర్కొన్నారు. ఏ వస్తువు కొనుగోలు చేసినా తగిన బిల్లు పొందాలని, అది ఉంటేనే న్యాయం జరుగుతుందన్నారు. శత్రుఘ్నుడు మాట్లాడుతూ వినియోగదారుల హక్కులు, బాధ్యతలపై అవగాహన కల్పించడమే తమ సంస్థ ముఖ్య ఉద్దేశమన్నారు. వినియోగదారులకు ఎటువంటి నష్టం కలిగినా తమను సంప్రదిస్తే తగిన విధంగా న్యాయం చేస్తామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రాజశేఖర్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

'రైల్వే వేగన్' వర్కర్ల్స్ సమస్యలు పరిష్కరించాలి



రైల్వే వేగన్ వర్క్ షాపు ఎదుట ఆందోళన నిర్వహిస్తున్న సిటు నాయకులు, కార్మికులు

అక్కిరెడ్డిపాలెం: వడ్లపూడి రైల్వే క్రాసింగ్ వద్ద ఆటోనగర్‌లోని రైల్వే వేగన్ రిపేర్ వర్క్‌షాపు కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో ఆదివారం ఆందోళన చేశారు. సిటు నాయకుడు జగ్గు నాయుడు మాట్లాడుతూ రైల్వే వేగన్ వర్క్ షాపు కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయడం లేదని, కార్మికులకు రక్షణ పరికరాలు లేకుండా పనులు చేయిస్తున్నారని ఆరోపించారు. కార్మికులు కారణం లేకుండా విధుల నుంచి తొలగింపు వంటి సమస్యలు ఎదుర్కొంటున్నారన్నారు. ఈ కార్యక్రమంలో సిటు జిల్లా కమిటీ అధ్యక్షుడు కె.యం.శ్రీనివాస్, రైల్వే వేగన్ వర్క్ షాపు యూనియన్ అధ్యక్షుడు రాంబాబు, ఈస్ట్ కోస్టు రైల్వే కాంట్రాక్ట వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి నరసింహులు, యూనియన్ నాయకులు అవతారం, వెంకటేశ్వరరావు, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

వైభవంగా సత్యసాయి మందిర వార్షికోత్సవం



కుట్టు మిషన్ అందజేస్తున్న స్టీల్‌ప్లాంట్ సీవీవో డాక్టర్ కరుణరాజు

ఉక్కునగరం: స్థానిక సత్యసాయి సేవా, ఆధ్యాత్మిక మందిరం వార్షికోత్సవం ఆదివారం వైభవంగా జరిగింది. ఉదయం వేద మంత్రం, నామ సంకీర్తనలతో వేడుకలు ప్రారంభమయ్యాయి. భక్తులు భజనలు నిర్వహించారు. గీతాలు ఆలపించారు. అంతకు ముందు స్టీల్‌ప్లాంట్ చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్ (సీవీవో) డాక్టర్ ఎస్.కరుణరాజు జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రేమతో కూడిన నిస్వార్థ సేవలకు ప్రతిరూపం సత్యసాయి సేవా సంస్థలని కొనియాడారు. కార్యక్రమంలో భాగంగా దివ్యాంగుడికి వీల్ చైర్, పేద మహిళకు కుట్టు మిషన్ అందజేశారు. ఈ సందర్భంగా ప్రదర్శించిన శ్రీసీతారామ కల్యాణం నాటకం ప్రేక్షకులను అలరించింది. ఈ కార్యక్రమంలో సమితి కన్వీనర్ జి.రామకృష్ణ, జిల్లా అధ్యక్షులు పి.ఆర్.ఎస్.ఎన్.నాయుడు, చిన్మయ మిషన్ గురువ రాఘవీరానంద, తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేటీకరణకు కార్మికులు వ్యతిరేకం



1046వ రోజు దీక్షా శిబిరంలో పాల్గొన్న పోరాట కమిటీ నాయకులు

కూర్మన్నపాలెం: ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణను కార్మికులంతా వ్యతిరేకిస్తున్నారని ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు తెలిపారు. కూర్మన్నపాలెంలోని స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద ఆదివారం జరుగుతున్న 1046వ రోజు ఉక్కు రిలే నిరాహార దీక్షలో సంస్థకు చెందిన పలు విభాగాల కార్మికులు పాల్గొని నిరసన తెలిపారు. విశాఖ ఉక్కు ప్రభుత్వ రంగంలోనే కొనసాగుతుందని ప్రధాని నరేంద్ర మోదీ స్పష్టమైన హామీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రైవేటీకరణతో విశాఖ ఉక్కుకు భూములిచ్చిన నిర్వాసితులు రోడ్డున పడ్డారని, వారిలో కొంతమందికి మాత్రమే కాంట్రాక్ట్ వర్కర్స్‌గా ఉపాధి లభించిందని, మిగతా వారి జీవితాలు అగమ్యగోచరంగా మారాయని ధ్వజమెత్తారు. విశాఖ ఉక్కును అమ్మాలని చూడడం అన్యాయమని, దీనికి వ్యతిరేకంగా విశాఖ ఉక్కు కార్మికవర్గం ఐక్యంగా ఉద్యమించాలన్నారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

క్రిస్మస్ వేడుకలకు వేళాయె..

- సర్వాంగ సుందరంగా ముస్తాబైన చర్చిలు
- ఏసుక్రీస్తును స్తుతిస్తూ ప్రత్యేక ఆరాధనలు



ఏసుప్రభువును స్తుతిస్తూ గీతాలాపన చేస్తున్న యువత, చిన్నారులు



విద్యుత్ కాంతులీనుతున్న సీఎల్‌సీ చర్చి



విద్యుత్ కాంతులీనుతున్న సీఎల్‌సీ చర్చి

గాజువాక: క్రైస్తవులు అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకునే క్రిస్మస్ పండగ కళ పట్టణంలో ఉట్టిపడుతోంది. క్రిస్మస్ వేడుకలకు గాజువాకలోని చర్చిలు సర్వాంగ సుందరంగా ముస్తాబయ్యాయి. విద్యుద్దీపాలు, క్రిస్మస్ ట్రీ, శాంతాక్లాజ్ బొమ్మలు, పశువుల పాక(క్రిబ్)ల అలంకరణలతో కళకళలాడుతున్నాయి. పాతగాజువాకలోని రోమన్ కేథలిక్ చర్చి, శ్రీనగర్‌లోని మన్నా, సీఎల్‌సీ యునైటెడ్ బాప్టిస్ట్, బీసీ రోడ్డు రైతుబజార్ సమీపంలోని యునైటెడ్ బాప్టిస్ట్, యుసీఎం, వుడా రోడ్డులోని యహోవా షమ్మా, సియోను ప్రార్థనా మందిరం క్రిస్మస్‌కు సిద్ధమయ్యాయి. ఉత్సవాల్లో భాగంగా ఆదివారం పలు చోట్ల ప్రత్యేక ప్రార్థనలు జరిపారు. క్రీస్తు స్తోత్రాలు, ఆరాధనలు నిర్వహించారు. ప్రభు ఏసుక్రీస్తును స్తుతించారు. క్రీస్తు జన్మ వృత్తాంతాలను ఏర్పాటు చేశారు. క్రిస్మస్ సందర్భంగా సోమవారం తెల్లవారుజాము నుంచి ప్రత్యేక ప్రార్థనలు, సువార్త కూటములు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. ఏసుక్రీస్తు జన్మవృత్తాంతాన్ని తెలుపుతూ ప్రదర్శించబోయే కళారూపకాలు ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నాయి. ఈ మేరకు క్రీస్తు సంఘాలు, పాస్టర్ సంఘాల ప్రతినిధులు తమ ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు.

ఉక్కునగరంలో చర్చిలు సిద్ధం

ఉక్కునగరం: క్రిస్మస్ వేడుకలకు ఉక్కునగరం చర్చిలు సిద్ధమయ్యాయి. రంగు రంగుల విద్యుత్ లైట్లతో వాటిని ముస్తాబు చేశారు. ఉక్కునగరం సెక్టర్–8లోని క్రైస్ట్ ది సేవియర్ క్యాథలిక్ చర్చిలో ఆదివారం రాత్రి నుంచే వేడుకలను ప్రారంభించనున్నారు. రాత్రి 11 నుంచి ప్రార్థనలు ప్రారంభం కానున్నాయి. సోమవారం చర్చి ఫాదర్ నేతృత్వంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించనున్నారు. సెక్టర్–12లోని అసెంబ్లీ ఆఫ్ గాడ్ చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించడానికి ఏర్పాట్లు జోరుగా సాగుతున్నాయి. ఉక్కునగరం పరిసర ప్రాంతంలో అతి పెద్దది, అధునాతమైన రూపాంతర లూథరన్ దేవాలయంలో ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. చర్చి ఫాదర్ ఆధ్వర్యంలో సోమవారం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించనున్నారు.

విద్యుత్ కాంతులు

అక్కిరెడ్డిపాలెం: స్థానిక క్రీస్తు ప్రార్థనా మందిరాలు చక్కగా ముస్తాబయ్యాయి. షీలానగర్‌లోని హయ్యర్ లూథరన్ మెమోరియల్ చర్చ్ రంగురంగుల విద్యుద్దీప కాంతులతో వెలుగొందుతోంది. ఆదివారం అర్ధరాత్రి నుంచి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహిస్తున్నారు.



విద్యుద్దీప అలంకరణలో స్టీల్‌సిటీ సేవియర్ చర్చి



అందంగా ముస్తాబైన ఉక్కునగరం రూపాంతర దేవాలయం



విద్యుద్దీప కాంతుల్లో షీలానగర్‌లోని హైయ్యర్ మెమోరియల్ లూథరన్ చర్చి

ఘనంగా అయ్యప్ప ఉత్సవ విగ్రహం ఊరేగింపు



ఊరేగింపులో పాల్గొన్న స్వామి అయ్యప్ప ఆలయ కమిటీ ప్రతినిధులు

అక్కిరెడ్డిపాలెం: షీలానగర్‌లోని స్వామి అయ్యప్ప దేవాలయం వద్ద ఉత్సవ విగ్రహం ఊరేగింపును ఆదివారం ఘనంగా నిర్వహించారు. దేవాలయ కమిటీ అధ్యక్షుడు ఎస్.ఎ.నాయుడు పూజలు చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. షీలానగర్ నుంచి అక్కిరెడ్డిపాలెం, బీహెచ్‌పీవీ టౌన్‌షిప్, నాతయ్యపాలెం, వెంకటేశ్వర కాలనీ, షీలానగర్, హరిజనజగ్గయ్యపాలెం ప్రాంతాల్లో ప్రజల దర్శనార్థం స్వామి అయ్యప్పను ఊరేగించారు. అనంతరం ఊరేగింపు షీలానగర్ చేరుకుంది. కార్యక్రమంలో దేవాలయ కమిటీ కార్యదర్శి టి.వి.శేషగిరిరావు, మెంబర్లు వీరారావు, బీజేపీ పైడిరాజు, మణికంఠ జ్యోతి భక్త సేవా సంఘం ప్రతినిధులు చరపాక నాగార్జున రాజు, నంబారు రాజు, బొడ్డు చినఅప్పల స్వామి, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

గీత కులాల ఐక్యత అవసరం



ఆత్మీయ సమ్మేళనంలో ప్రసంగిస్తున్న సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు వెంకటేష్ గౌడ్

ఉక్కునగరం: గీత కులాలకు చెందిన యాత, శెట్టిబలిజ, గౌడ, శ్రీసైన, ఈడిగలు ఐక్యంగా ఉండాలని ఉత్తరాంధ్ర సర్దార్ గౌతు లచ్చన్న గీత కులాలు యువజన సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు ఏకుల వెంకటేష్ గౌడ్ పిలుపునిచ్చారు. గాజువాక పారిశ్రామిక ప్రాంతం గీత సహ కులాల సంఘం పెద్దల సూచనలతో యూత్ కమిటీ బృందం ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక నెహ్రూ పార్కులో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐక్యతతో తమ కులాల సమస్యలను పరిష్కరించుకోవడంతో పాటు సమాజంలో మంచి స్థానంలో ఉంటామన్నారు. పిల్లలు, పెద్దలు తాము సాధించిన విజయాలను వివరించారు. క్రీడల్లో, చదువుల్లో రాణించిన బాలబాలికలకు బహుమతులు అందజేశారు. వివిధ పదవులు అధిరోహించిన నాయకులను సంఘం ఆధ్వర్యంలో సత్కరించారు. కార్యక్రమంలో అధ్యక్షుడు పిల్లి నూకరాజు, యాత కార్పొరేషన్ చైర్మన్ పిల్లి సుజాత, 72వ వార్డు కార్పొరేటర్ స్టాలిన్, కనక మహాలక్ష్మి ట్రస్ట్ బోర్డు చైర్మన్ కొల్లి సింహాచలం, సింహాచలం ట్రస్ట్ బోర్డు సభ్యులు సంపంగి శ్రీనివాసరావు, చైర్మన్లు బత్తిన పరదేశి, నెల్లి సాధురావు, బీసీ నాయకులు నెల్లి అప్పలరాజు, చెల్లిబోయిన నాయుడు, ఎస్. శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

అప్పన్న అన్నప్రసాద పథకానికి రూ.లక్ష విరాళం

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి శాశ్వత అన్నప్రసాద పథకానికి ఆదివారం నగరంలోని గోపాలపట్నంకు చెందిన ఎస్. యామినిరెడ్డి రూ.లక్ష విరాళాన్ని ఆలయ సూపరింటెండెంట్ సిరిపురపు కనకరాజుకు అందజేశారు. దేవస్థానం తరపున దాతకు స్వామివారి దర్శనం కల్పించారు. ఆలయ ప్రధానార్చకుడు గొడవర్తి శ్రీనివాసాచార్యులు, ఏఈవో భ్రమరాంబ పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

గాజువాక: పూర్వ విద్యార్థులు మూడు దశాబ్దాల తరువాత కలుసుకుని సందడి చేశారు. ఆత్మీయ పలకరింపులు, ఆలింగనాల నడుమ నాటి మధుర స్మృతులను నెమరు వేసుకొంటూ సంతోషాన్ని పంచుకున్నారు. గాజువాక జిల్లా పరిషత్ హైస్కూల్‌లో 1993–94 పదో తరగతి బ్యాచ్ విద్యార్థుల ఆధ్వర్యంలో ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఒకరికొకరు యోగ క్షేమాలను తెలుసుకుని చిన్ననాటి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. అప్పటి విద్యార్థి నాయకులు గొలగాని అప్పలరాజు, శివశంకర్, వారిస్, బత్తుల హరి, గణేష్, కోటి, మురళి, వెంకటరావు, శివారెడ్డి, రామ్, శంకర్, ధనలక్ష్మి, సాగి కృష్ణవేణి, వై.లక్ష్మి, జీవీఎస్ అప్పారావు తదితరులు ఈ సమ్మేళనానికి సారథ్యం వహించారు.

మెగా వైద్య శిబిరానికి స్పందన

కూర్మన్నపాలెం: ఆయుష్మాన్ భారత్‌ను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్న ఉద్దేశంతో అన్ని ప్రాంతాల్లోనూ మెగా వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు బీజేపీ గాజువాక కన్వీనర్ కరణంరెడ్డి నరసింగరావు తెలిపారు. 87వ వార్డు వడ్లపూడి సామాజిక భవనంలో బీజేపీ కో కన్వీనర్ లక్కరాజు సోంబాబు అధ్యక్షతన ఆదివారం జరిగిన మెగా వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధాని నరేంద్రమోదీ ప్రారంభించిన ఆయుష్మాన్ భారత్ గుర్తింపు కార్డు ద్వారా దేశంలో ఎక్కడైనా రూ.5 లక్షల వరకు ఉచితంగా వైద్య సేవలు పొందవచ్చునన్నారు. వార్డు అధ్యక్షుడు సురేష్, మండల అధ్యక్షులు గూలూరు శంకరరావు, జిల్లా కార్యదర్శి బిడా యల్లాజీరావు, నాగేశ్వరరావు, కరణం వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.